క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

భాకరాపేట : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని ఉలసలవాండ్లపల్లెలో గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జ్వరము, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, కంటి లోపల నొప్పి, ఒంటిపై దద్దుర్లు తదితర లక్షణాలు ఉంటే డెంగీ వ్యాధిగా గుర్తించాలని తెలిపారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అమరనాథరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఈశ్వర్‌బాబుకు ఘన సత్కారం

పాకాల : లెఫ్టినెంట్ హోదా పొందిన ఎన్‌సీసీ అధికారి ఈశ్వర్‌బాబును శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పట్టుదలతో కృషి చేసి లెఫ్టినెంట్ హోదా సాధించిన ఈశ్వర్‌బాబును ప్రశంసించారు. కార్యక్రమంలో వాయల్పాడు కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ రమేశ్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ రాఘవరెడ్డి, వాసు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల పరిచయ వేదిక రేపు



మాట్లాడుతున్న సాకం ప్రభాకర్

తిరుపతి కల్చరల్ : అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తిరుచానూరులోని శ్రీపద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు సంఘం నేతలు బండారు శ్రీనివాసులు, సాకం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. వేదికకు వచ్చేవారు వధూవరుల బయోడేటాతో పాటు రెండు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో సంఘం నేత గుణశేఖర్ పాల్గొన్నారు.

అగరాలలో ఉపాధి పనులు

చంద్రగిరి : పల్లె పండుగలో భాగంగా శుక్రవారం అగరాల పంచాయతీలో ఉపాధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ వెనుక పెద్ద ఊటగుంట పనులకు సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ సుమారు రూ.4.95 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ అగరాల దేవారెడ్డి, ఏపీఓ జ్యోతి, ఉప సర్పంచ్ సుశీల, ఎఫ్ఏ నందిని, వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యం, కూలీలు వనజ, పావని, పునీత్, రాజేంద్రమ్మ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

పాకాల: రైలు కింద పడి వ్యక్తి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాకాలవారిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానిక రైల్వే పోలీసుల కథనం.. చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ, పాకాలవారిపల్లికి చెందిన చెంగ్రాయలు కుమారుడు పాసం రెడ్డికుమార్(45) అనారోగ్యం కారణంగా జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిత్తూరు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం




జ్ఞానప్రసూనాంబ ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా శుకవార ఉత్సవం నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ అలంకార మండపంలో విశేష అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి ఆలయ ప్రాకారంలో శుక్రవార ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ సెక్యూరిటీపై దాడికి యత్నం

శ్రీకాళహస్తీశ్వరాయం వద్ద ఇద్దరు బాలికలు, నలుగురు యువతులు పుస్తకాలు విక్రయిస్తుంటారు. భక్తులను ఇబ్బందిపెట్టడం చూసి ఓ మహిళా సెక్యూరిటీ గార్డు వారిని మందలించింది. వెంటనే వారు ఆమెపై దాడికి యత్నించారు. బడికి వెళ్లాల్సిన వయసులో ఇలా భక్తులతో చెలగాటమాడడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

హుషారు.. షికారు!



- కారు నడపడంపై మహిళలకు పెరిగిన ఆసక్తి
- డ్రైవింగ్ స్కూళ్లలో చేరుతున్న అతివలు
- లైసెన్స్‌ల కోసం పెద్దసంఖ్యలో దరఖాస్తులు
- తిరుపతిలో 20 శాతం వరకు లేడీ డ్రైవర్లు

పురుషులతో ధీటుగా అతివలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పట్టుదలతో సత్తా చాటుతున్నారు. స్వతంత్ర భావాలతో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. మధ్యతరగతి మహిళలు సైతం అనుకున్నది సాధిస్తున్నారు. ఒకప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే తోడుగా వచ్చేవారి కోసం ఎదురు చేసేవారు. ఇప్పుడు మోటారు వాహనాలైనా అలవోకగా నడిపేస్తున్నారు. ఇప్పటికే స్కూటీలు.. బైక్‌లను అధిగమించి కార్లను రోడ్డెక్కిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతిలో సొంతంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లేవారు అధికంగా కనిపిస్తున్నారు. అలాగే నిబంధనల మేరకు లైసెన్స్ తీసుకునేందుకు ఆర్టీఓ కార్యాలయం వద్ద భారీ సంఖ్యలో బారులుతీరుతున్నారు.

తిరుపతి మంగళం : మహిళలు కారులో బయటకు వెళ్లాలంటే వాహనాన్ని నడిపేందుకు డ్రైవర్ లేదా కుటుంబ సభ్యుల్లో ఒకరు ఉండాలని ఆలోచించే రోజులు పోయాయి. మారుతున్న కాలంతో పాటు మధ్యతరగతి మహిళల ఆలోచనా విధానంలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎక్కువ మందిలో ఇండిపెండెంట్‌గా ఉండాలనే ఆలోచన కనిపిస్తోంది. అందుకు అనుగుణంగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే తిరుపతి నగరంలో ప్రొఫెషనల్ డ్రైవర్స్‌కు తామేమీ తీసిపోమన్నంత ఫర్‌ఫెక్ట్‌గా మహిళలు తయారవుతున్నారు. ఇంటి నుంచి కార్యాలయానికి, ఇతర అవసరాలకు సొంతంగా కార్లు నడిపే మహిళల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో పాటు లాంగ్ డ్రైవ్‌కు కూడా తామేమీ తీసిపోమంటూ సత్తా చాటుతున్నారు.





కారు డ్రైవ్ చేస్తున్న మహిళ, ఆర్‌టీఓ కార్యాలయంలో ఎల్ఎల్ఆర్ టెస్ట్‌కు హాజరైన యువతులు

ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు

నగరంలో డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకునే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో కేవలం పురుషులు మాత్రమే లైసెన్స్ కోసం అధికంగా క్యూ కట్టేవారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా లైసెన్స్‌ల కోసం మహిళలు కూడా బారులు తీరుతున్నారు. గతంలో ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలంటే మహిళలు కొంత ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం స్థానిక లైసెన్స్‌తో పాటు అంతర్జాతీయ లైసెన్స్ కోసం అతివలు భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారని రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. నిత్యం ఉద్యోగం, ఇంటి పనుల్లో బిజీగా ఉండే మహిళలు సెలవులు వచ్చాయంటే చాలు ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన, విహార యాత్రలకు సిద్ధమైపోతున్నారు. కుటుంబ సభ్యులను కారులో ఎక్కించుకుని ఎంచక్కా ముందుకు సాగిపోతున్నారు.

వందల మందికి నేర్పించాం



బైక్‌లు, కార్లు డ్రైవ్ చేయడంలో మగవారికేమీ తీసిపోకుండా ముందుకు వెళ్లాలన్నదే నేటి మహిళల ఆలోచన. విమానాలు, రాకెట్‌లు నడుపుతూ మహిళలు అంతరిక్షంలోకి సైతం వెళ్లి వస్తున్నారు. అదే స్ఫూర్తితో చాలా మంది ఆడవాళ్లు కారు నేర్చుకుని డ్రైవ్ చేయడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే మా డ్రైవింగ్ స్కూల్ నుంచి వందల మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించాం. అలాగే రహదారి నిబంధనలపై అవగాహన కల్పించాం. వారంతా ఇప్పుడు తిరుపతి నగరంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా సొంతంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్నారు.

–ప్రత్యూష, కారు డ్రైవింగ్ ట్రైనర్, తిరుపతి

సొంతంగా నడిపడమే ఇష్టం



సొంతంగా కారు నడపడమంటే నాకు చాలా ఇష్టం. కుటుంబసభ్యులను ఎక్కించుకుని లాంగ్ డ్రైవ్‌కు వెళుతుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. ఎప్పుడు ఊరు వెళ్లినా నేనే కారు నడుపుతుంటా. ఇది వరకు డ్రైవర్ కోసం చూడాల్సి వచ్చేది. అందుకోసం సమయం వృథా అయ్యేది. ఈ క్రమంలోనే నేను డ్రైవింగ్ నేర్చుకున్నా. ఇప్పుడు ఎక్కడకు వెళ్లాలన్నా ఎవరి మీదా ఆధారపడకుండా సులువుగా కారులో చేరుకుంటున్నా. మనసు పెట్టి నేర్చుకుంటే కొద్ది రోజుల్లోనే కారును చక్కగా నడపవచ్చు. రోడ్డు భద్రతా నిబంధనలు తెలుసుకుంటే క్షేమంగా గమ్యం చేరుకోవచ్చు.

– మాధురి, తిరుపతి

త్రిష్ణా–2024 పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో త్రిష్ణా–2024 నేషనల్ టెక్నికల్ లెవల్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ నాధమునిరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 500మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈసీఈ హెడ్ డాక్టర్ ఎస్.పుష్పలత పాల్గొన్నారు.

హంసధ్వని పుస్తకావిష్కరణ రేపు

తిరుపతి కల్చరల్ : విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో మరువాడ భీమశంకర్ రచించిన హంసధ్వని పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. శుక్రవారం ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆవిష్కరణ అనంతరం ,ఆత్మీయ సమీక్ష ఉంటుందన్నారు. ముందుగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల గాత్ర విభాగాధిపతి డాక్టర్ ఏ.శబరి గిరీష్ గాత్ర కచేరి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఎస్వీయూ గ్రౌండ్‌లో 'లైవ్ షో'పై ఆగ్రహం



వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ క్రీడా మైదానంలో సింగర్ కార్తీక్ లైవ్ షో ఏర్పాటు చేయడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. శుక్రవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నేతలు వీసీ అప్పారావుకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ వర్సిటీ మైదానంలో అడ్డగోలుగా ఎంట్రీ ఫీజుల వసూలు చేస్తూ ప్రైవేట్ వాణిజ్య కార్యక్రమాలు నిర్వహించడం దారుణమన్నారు. 50 ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలు జరిగాయని, అయితే ఎంట్రీ ఫీజు వసూలు చేసిన దాఖలాలు లేవని వెల్లడించారు. ఈ నెల 26వ తేదీన వర్సిటీ మైదనాంలో సింగర్ కార్తీక్ లైవ్ షోకు బుక్ మై షో యాప్ ద్వారా ఎంట్రీ టికెట్ రూ.2వేల నుంచి రూ.8వేల వరకు వసూలు చేస్తున్నారని, అందులో భాగంగా ఇప్పటికే సుమారు రూ.3కోట్ల వరకు సేకరించినట్లు విమర్శించారు. ఇందుకోసం వర్సిటీ అధికారులకు భారీగా లంచాలు ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. దీనిపై వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి జంగం రెడ్డి కిషోర్ దాస్, నాయకులు ముని కుమార్, కార్యవర్గ సభ్యులు నరేష్, చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల పవన్ కుమార్ యాదవ్, రావూరి హరికృష్ణ , జగదీష్ యాదవ్ పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

పాకాల : వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. ఇదేవిధంగా మరో రెండు రోజులపాటు వర్షాలు కురిస్తే అన్ని చెరువులు నిండిపోతాయని అధికారులు వెల్లడిస్తున్నారు. రైతులకు సాగునీటి కష్టాలు తప్పుతాయని వివరిస్తున్నారు.



నిండిన నాయిని చెరువు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: అబ్దుల్ కలాం ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2024 సెకెండ్ లెవల్ చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన ఎంజీఎం విద్యార్థులు సత్తా చాటారు. చెన్నైలో జరిగిన ఈ పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో తేజో మారుతీప్రసాద్ రాష్ట్రస్థాయి రెండో బహుమతి పొందాడు. అండర్–12 బాలికల విభాగంలో మీనాక్షి మూడో బహుమతి సాధించింది. వీరిని ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఐశ్వర్య

తుపాన్ బాధితులను ఆదుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి: తుపాన్ బాధితులను ఆదుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను శుక్రవారం సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ రెండురోజులుగా కురిసిన వర్షానికి శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి, వేడాం, చుక్కలనిడిగల్లు గిరిజనకాలనీ లు, పట్టణంలోని ఈశ్వరయ్య కాలనీ, చెంచులక్ష్మీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరాయన్నారు. దీంతో వారు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రభుత్వం తరపున వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మించల శివకుమార్, మునిరాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

భాకరాపేట : భారీ వర్షాల కారణంగా చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో దెబ్బతిన్న పంటలను ఉద్యానశాఖ అధికారి శివకుమారి శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ టమాట పంటలో నిలబడిన నీటిని వెంటే తొలగించాలని సూచించారు. ఒరిగిన మొక్కలను నిలబెట్టి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలని కోరారు. లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా, పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు కలిపి మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. పంటపై 1 గ్రాము బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. తెగుళ్ల నివారణకు 1 లీటరు నీటికి కార్బన్డజిమ్ లేదా 1 గ్రాము మ్యాంకోజబ్ 2.5 గ్రాములు పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ పురాణ ఇతిహాస విభాగం ఆధ్వర్యంలో ఆదికవి వాల్మీకి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ జీఎస్ఆర్ కృష్ణ మూర్తి వర్సిటీ ఆవరణలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పరిమిత పండా, డీన్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ నిరంజన్ మిశ్రా, డాక్టర్ బలిచక్రవర్తి పాల్గొన్నారు

నేడు మహతిలో అవార్డుల ప్రదానం



మాట్లాడుతున్న భాష సిరివెల్ల

తిరుపతి కల్చరల్ : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా శనివారం మధ్యాహ్నం మహతి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదానం చేపడుతున్నట్లు నిర్వాహకుడు భాష సిరివెల్ల తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బెంగళూరు ఇస్రో కేంద్రం ఓఎస్‌డీ కేవీ లక్ష్మణకుమార్, సైంటిస్ట్ భవానీ కుమార్, అంతర్జాతీయ డెయిరీ సైంటిస్ట్ కరుణానిధి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో హేమంత్, కార్తీక్ పాల్గొన్నారు.

నేతలతో మాటామంతీ



వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి అల్పాహారం తింటున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుచానూరు) : వైఎస్సార్‌సీపీ నేతలతో తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సరదాగా ముచ్చటించారు. శుక్రవారం తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం వద్ద ఓ హోటల్‌లో నేతలతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా నేతల యోగక్షేమాలు విచారించారు. పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు కష్టపడదామని పిలుపునిచ్చారు. గెలుపోటములు సహజమని, ప్రజలకు తోడుగా ఉంటే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని వెల్లడించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని, ప్రజల్లో తిరుగుబాటు వచ్చేందుకు ఎంతో సమయం పట్టదని వివరించారు.

నికీ మోటార్స్ 'ఏప్రిలియా' డెలివరీ



బైక్ కీ అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్, నికీ మోటార్స్ సీఈఓ

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డులోని పియాజియో ఇండియా ప్రతిష్టాత్మక ద్విచక్ర వాహన బ్రాండ్లు వెస్పా, ఏప్రిలియాలకు అధీకృత రిటైలర్ నికీ మోటార్స్ ప్రీమియం షోరూమ్‌లో కందాల పునీత్ కృష్ణకు 25వ ఏప్రిలియా ఆర్ఎస్–457ను డెలివరీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, నికీ మోటార్స్ సీఈఓ నాగభూషణ్‌రెడ్డి చేతుల మీదుగా కస్టమర్‌కు బైక్ తాళం అందజేశారు. సీఈఓ మాట్లాడుతూ ఏప్రిలియా ఆర్ఎస్ 457 వాహనం మూడు విభిన్న రంగుల్లో లభిస్తోందన్నారు. ఎక్స్ షోరూం ధర రూ.4.11లక్షలని వెల్లడించారు.

150 మందికి కంటి పరీక్షలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందరపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పుట్టారెడ్డి నారాయణరెడ్డి స్మారక ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 15 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. 15 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు డమరకనాథరెడ్డి, రుయా ఆస్పత్రి వైద్యులు చలపతిరెడ్డి, శ్రీలక్ష్మి, విశ్వనాథరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



వీసీకి ఆకుకూరలు అందిస్తున్న గంగాధరం తదితరులు

ప్రకృతి సేద్యంపై అవగాహన

తిరుపతి సిటీ : ప్రకృతి సేద్యంపై యువతకు అవగాహన అవసరమని వర్డ్ సంస్థ కార్యదర్శి డాక్టర్ గంగాధరం తెలిపారు. శుక్రవారం ఈ మేరకు సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆకు కూరలను ఎస్వీయూ వీసీ అప్పారావు, అధికారులకు గ్రీన్ టీమ్ సభ్యులతో కలిసి అందించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పెరటిలో తక్కువ స్థలంలో కూడా ఆకుకూరలు పండించుకోవచ్చని సూచించారు.



అలసితి.. అండగా నిలిచితి!

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు.. కష్టాన్నే నమ్ముకుని సాగే జీవితం.. పొట్టకూటి కోసం మూడు చక్రాల బండి లాగడమే నిత్యకృత్యం.. అయితే శుక్రవారం బండిపై బరువు పెరిగింది. లీలామహల్ కూడలి చేరేసరికి ఒంటికి నీరసం వచ్చింది.. పెద్ద మూటలు వేసిన బండిని లాగలేక నిస్సత్తువ ఆవరించింది. అంతే ఒక్కసారిగా ఆ శ్రామికుడు నేలపై కూలబడ్డాడు. ట్రాఫిక్ సమయం కావడంతో వెంటనే తేరుకుని బండిని కదిలించేందుకు యత్నిస్తుండగా దారిన వెళుతున్న పాదచారులు ఆదరువుగా నిలబడ్డారు. కష్టజీవికి చేయూతనందించారు. మానవత్వాన్ని ఆవిష్కరించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



